



మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number
TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

ఇంకెందుకు ఆలస్యం...
9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 233 | ఏప్రిల్ 20 సోమవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# మహిళా రిజర్వేషన్‌ను అడ్డుకున్న టీఎంసీని శిక్షించండి: మోదీ పిలుపు



మన దునియా,బిష్ణుపూర్:ఏప్రిల్ 19

బిష్ణుపూర్: లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు వీగిపోవడంతో విపక్షాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శల దాడి కొనసాగించారు. కాంగ్రెస్ పార్టీతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ కుమ్మక్కై దిగువసభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ఓడించిందని, ఇందువల్ల మహిళలకు జరగాల్సిన న్యాయం జరగలేదని విమర్శించారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిష్ణుపూర్‌లో ఆదివారంనాడు జరిగిన ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, వికసిత్ భారత్ కలల సాకారం, దేశాభివృద్ధికి భారత రాజకీయాల్లో మహిళలకు మరింత భాగస్వామ్యం కల్పించాలని కేంద్రం కోరుకుంటోందని అన్నారు. అయితే బెంగాల్ తల్లులు, చెల్లెళ్లను టీఎంసీ వంచించిందని ఆరోపించారు. ప్రజలను నిరంతరం దోచుకోవడమే కాకుండా బెంగాల్ మహిళలకు దక్కాల్సిన హక్కులను టీఎంసీ దక్కనీయడం లేదని తప్పుపట్టారు. 'బెంగాల్ మహిళలు 33 శాతం రిజర్వేషన్ కోరుతున్నారు. ఇందుకు నేను భరోసా కూడా ఇచ్చాను. 2029 నుంచే రిజర్వేషన్ అమలు చేయాలని మహిళల కోరికగా ఉంది. అందుకోసం మేము ప్రయత్నాలు సాగించాం. అయితే తమ మహా జంగిల్ రాజ్‌ను సవాలు చేస్తారనే కారణంగా మరింత మంది మహిళలు ఎమ్మెల్యేలు, ఎంపీలు కావడానికి టీఎంసీ ఇష్టపడటం లేదు. 33 శాతం రిజర్వేషన్ మహిళలకు దక్కకుండా కాంగ్రెస్‌తో కలిసి టీఎంసీ కుట్రపూరితంగా అడ్డుకుంది' అని ప్రధాని విమర్శలు గుప్పించారు.

(మిగతా 2వ పేజీలో..)

## కాటారం వేదికగా రేపు రెండో విడత రైతు భరోసా నిధులు!

రైతులకు రూ.5,653 కోట్ల పెట్టుబడి సహాయం!

మన దునియా,హైదరాబాద్, ఏప్రిల్ 18

తెలంగాణలోని రైతులకు రైతు భరోసా రెండో విడత నిధుల పంపిణీకి రంగం సిద్ధమైంది సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూరిపల్లి,లో నిర్వహించే బహిరంగ సభలో



## చెన్నై సూపర్ 6... 20 పాయింట్ల ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసిన స్టాలిన్



## బాణసంచా తయారీ ఫ్యాక్టరీలో భారీ పేలుడు.. 19 మంది మృతి

మన దునియా,విరుధునగర్: తమిళనాడు:ఏప్రిల్ 19




విరుధునగర్: తమిళనాడులోని విరుధునగర్ జిల్లాలో పెను విషాదం చోటుచేసుకుంది. సాత్తూరు సమీపంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించి 19 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

(మిగతా 2వ పేజీలో..)

## హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'.. దేశవ్యాప్తంగా 52 మంది అరెస్ట్

అరెస్టయిన వారిలో 32 మంది బ్యాంకు అధికారులు

9 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించిన 16 ప్రత్యేక బృందాలు

మ్యూల్ ఖాతాలు తెరవడంలో అధికారుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణ

ఫిబ్రవరిలో జరిగిన ఆపరేషన్ ఆక్టోపస్-1కు ఇది కొనసాగింపు

దేశవ్యాప్తంగా విస్తరించిన భారీ



(మిగతా 2వ పేజీలో..)

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# కాటారం వేదికగా రేపు రెండో విడత రైతు భరోసా నిధులు!

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఐటి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, సమక్షంలో ల్యాప్ టాప్ బటన్ మీద నొక్కి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రెండో విడత కింద 45, 11,947 మంది రైతుల ఖాతాల్లో రూ.2,063 కోట్లు జమకానున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారంలో జరిగే బహిరంగ సభ నుంచే సీఎం ఈ నిధులను విడుదల చేస్తారు. రాష్ట్రంలో 73 లక్షల మంది రైతులు ఉన్నారు. యాసంగి రైతు భరోసా సాయం కింద మార్చి 23న ప్రతి రైతుకూ ఒక్కో ఎకరానికీ రూ.6వేల చొప్పున దాదాపు రూ.3,590 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇప్పుడు రెండో విడత కింద దాదాపు 36.72 లక్షల ఎకరాలకు చెందిన అన్నదాతలకు రైతు భరోసా అందనుంది. రెండు విడతల్లో కలిపి రైతులకు మొత్తం రూ.5,653 కోట్ల సాయం అందినట్లవుతుం దని వ్యవసాయ శాఖ వెల్లడించింది. మూడో విడత నిధులను వీలైనంత త్వరగా అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కాగా, సీఎం రేవంత్ సోమవారం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించనున్నారు. తర్వాత అక్కడి నుంచి బయలుదేరి కాటారం లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొననున్నారు.

## గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ.. ఏం చర్చించారంటే..

**మన దునియా,హైదరాబాద్: ఏప్రిల్ 19**

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లోక్‌భవన్‌లో ఈరోజు(ఆదివారం) మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంట మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఉన్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎంతో గవర్నర్ చర్చించారు. విద్యారంగానికి సంబంధించి వివిధ అంశాలపై మాట్లాడారు. విద్యాసంస్థల్లో మాదక



ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించాలని గవర్నర్ సూచించారు. ఇందుకు సంబంధించి విద్యార్థులతో ప్రమాణం చేయించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జూన్ 12వ తేదీన ఎల్బీస్టేడియంలో గవర్నర్ ఆధ్వర్యంలో చేపట్టనున్న అవగాహన కార్యక్రమంపై సీఎంతో చర్చించారు. పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ల సమయంలోనే మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రమాణపత్రం తీసుకోవాలని సూచించారు. గవర్నర్ సూచనలు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## బాణసంచా తయారీ ఫ్యాక్టరీలో భారీ పేలుడు.. 19 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన వివరాల ప్రకారం, ఫ్యాక్టరీలో కార్మికులు బాణసంచా తయారు చేస్తుండగా రసాయనాలు కలుపుతున్న సమయంలో మంటలు చెలరేగి వరుస పేలుళ్లు సంభవించాయి. పేలుడు ధాటికి ఫ్యాక్టరీలోని పలు గదులు దెబ్బతిన్నాయి. మృతుల్లో పలువురు మహిళా కార్మికులు ఉన్నట్టు తెలుస్తోంది. సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటానా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేస్తున్నారు. క్షతగాత్రులను విరుధునగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. బాణసంచా యూనిట్ గోవందనల్లూరుకు చెందిన ముత్తు మాణిక్యం అనే వ్యక్తికి చెందినదిగా తెలుస్తోంది.

**ముఖ్యమంత్రి స్టాలిన్ సంతాపం**

బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో పలువురు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. జిల్లా కలెక్టర్‌తో ఫోనులో మాట్లాడారు. తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని మంత్రులు రామచంద్రన్, తంగమ్ తెన్నరసును ఆదేశించారు..

## ఎడప్పాడిలో అనూహ్య మలుపు.. తమ అభ్యర్థి నామినేషన్ రద్దు.. స్వతంత్ర అభ్యర్థికి విజయ్ మద్దతు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ సేలం జిల్లాలోని ఎడప్పాడి నియోజకవర్గంలో అనూహ్య రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తమ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురవడంతో ఒక స్వతంత్ర అభ్యర్థికి మద్దతు ప్రకటించింది. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.ఎడప్పాడి నుంచి పోటీ చేసేందుకు టీవీకే తరఫున దాఖలైన నామినేషన్‌ను అధికారులు పరిశీలనలో తిరస్కరించారు. ఈ పరిణామంతో పార్టీ శ్రేణులు నిరాశలో ఉన్న తరుణంలో అధ్యక్షుడు విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇదే నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రేమ్‌కుమార్‌కు పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ప్రేమ్‌కుమార్ తన చిరకాల మిత్రుడని, అభిమాన సంఘం మాజీ నిర్వాహకుడని, సోదర సమానుడని విజయ్ పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేమ్‌కుమార్‌కు అండగా నిలవాలని పార్టీ ఏకగ్రీవంగా నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఎడప్పాడిలోని పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు, ఓటర్లు ప్రేమ్‌కుమార్‌కు కేటాయించిన 'టెలివిజన్ సెట్' గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజయ్ విజ్ఞప్తి చేశారు. పార్టీ ఎదుగుదలను అడ్డుకోవాలని చూస్తున్న వారికి ప్రేమ్‌కుమార్ గెలుపు ఒక గుణపాఠం అవుతుందని పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఏఐఏడీఎంకే సీనియర్ నేత ఎడప్పాడి కె. పళనిస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో టీవీకే మద్దతుతో బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థి కారణంగా పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.

# మహిళా రిజర్వేషన్‌ను అడ్డుకున్న టీఎంసీని శిక్షించండి: మోదీ పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

**బెంగాల్‌లో బీజేపీ గెలుపు తథ్యం**

భారతీయ జనతా పార్టీ అంటేనే మహిళా సాధికారత, భద్రతకు కట్టుబడిన పార్టీ అని, ఆ కారణంగానే బీజేపీకి మహిళల నుంచి నిరంతర ఆదరణ లభిస్తోందని మోదీ అన్నారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని, అది తెలిసే ప్రజలను టీఎంసీ బెదిరిస్తోందని విమర్శించారు. 'టీఎంసీ గూండాలు' వెంటనే లొంగిపోవాలని, మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మాత్రం వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కాంగ్రెస్, టీఎంసీలు గిరిజన వ్యతిరేకులని, 2022 రాష్ట్రపతి ఎన్నికల్లో గిరిజన అభ్యర్థి ద్రౌపది ముర్ముపై అభ్యర్థిని పోటీగా నిలబెట్టారని విమర్శించారు. బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం వస్తే పేద మహిళలకు ఉచిత రేషన్ ఇస్తామని, ప్రజల రేషన్‌ను ఎవరూ తన్నుకుపోనీయమని చెప్పారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రెండు విడతలుగా ఏప్రిల్ 23, 29 తేదీల్లో జరుగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడతాయి..




# హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'.. దేశవ్యాప్తంగా 52 మంది అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను హైదరాబాద్ నగర పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా 9 రాష్ట్రాల్లో 32 మంది బ్యాంకు అధికారులతో సహా మొత్తం 52 మందిని అరెస్టు చేశారు. ఈ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదివారం మీడియాకు వెల్లడించారు.వారం రోజుల పాటు 16 ప్రత్యేక పోలీసు బృందాలు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్ రాష్ట్రాల్లో ఏకకాలంలో ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అరెస్టయిన వారిలో సైబర్ నేరగాళ్లకు సహకరించిన 32 మంది బ్యాంకు అధికారులు, మోసపూరిత లావాదేవీల కోసం తమ ఖాతాలను వాడటానికి అనుమతించిన 15 మంది మ్యూల్ ఖాతాదారులు, నేరగాళ్లకు ఈ ఖాతాలను అందించే ఐదుగురు మధ్యవర్తులు ఉన్నారు.ఇండస్‌ఇండ్ బ్యాంకుకు చెందిన ఆరుగురు, బంధన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఐదుగురు చొప్పున, ఫెడరల్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుకు చెందిన నలుగురు చొప్పున అధికారులతో పాటు మరో ఐదు ప్రైవేట్ బ్యాంకులకు చెందిన అధికారులు కూడా అరెస్టయిన వారిలో ఉన్నారు. నిందితుల నుంచి 26 మొబైల్ ఫోన్లు, 14 చెక్ బుక్కులు, ఒక ల్యాప్‌టాప్, 21 షెల్ కంపెనీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు.పెట్టుబడుల మోసాలు, ట్రేడింగ్ ఫ్రాడ్స్, 'డిజిటల్ అరెస్ట్' వంటి సైబర్ నేరాలు పెరిగిపోవడంతో ఈ ఆపరేషన్ చేపట్టామని సజ్జనార్ తెలిపారు. ఫిబ్రవరి 2026లో 'ఆపరేషన్ ఆక్టోపస్-1' ద్వారా రూ. 150 కోట్ల లావాదేవీలకు సంబంధించిన 117 మందిని అరెస్ట్ చేశామని, దానికి కొనసాగింపుగా బ్యాంకు అధికారులను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ ప్రారంభించామని వివరించారు. సరైన కేవైసీ ధృవీకరణ లేకుండానే మ్యూల్ ఖాతాలు తెరుస్తూ సైబర్ నేరగాళ్లకు ప్రైవేట్ బ్యాంకులు సహకరిస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని కమిషనర్ పేర్కొన్నారు.



# చెన్నై సూపర్ 6... 20 పాయింట్ల ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసిన స్టాలిన్

**చెన్నై జిల్లాకు 'సూపర్ 6' పేరుతో ప్రత్యేక మేనిఫెస్టో**

**ఆరు కీలక రంగాల్లో 20 ప్రధాన ప్రకటనలు**

**1000 కొత్త మినీ బస్సులు, ఏఐ ఆధారిత ట్రాఫిక్ వ్యవస్థ**

**మౌలిక వసతుల ప్రాజెక్టులకు కచ్చితమైన గడువులు**

**రూ.10,000 కోట్లతో గ్లోబల్ సెంటర్, 20,000 ఉద్యోగాల కల్పన**



తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, చెన్నై జిల్లాను లక్ష్యంగా చేసుకుని 'చెన్నై సూపర్ 6' పేరుతో ఒక ప్రత్యేక ఎన్నికల మేనిఫెస్టోను ఆదివారం విడుదల చేశారు. నగర మౌలిక సదుపాయాలు, రవాణా, పట్టణ సౌకర్యాలు, భవిష్యత్ ఆర్థిక వృద్ధి వంటి ఆరు కీలక రంగాల్లో మొత్తం 20 హామీలను ఇందులో పొందుపరిచారు.పట్టణ రవాణా వ్యవస్థను మెరుగుపరచడంలో భాగంగా, చివరి మైలు కనెక్టివిటీ కోసం 1,000 కొత్త మినీ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు డీఎంకే హామీ ఇచ్చింది. ఈ బస్సులు వీధులను బస్టాప్‌లు, మెట్రో స్టేషన్లు, రైల్వే హబ్‌లతో కలుపుతాయి. దీనికి తోడు, ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని 25 శాతం వరకు తగ్గించేందుకు ఏఐ (ఏఐ) ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను తీసుకొస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు.కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. ఎన్నూర్ నుంచి పూంజేరి వరకు చెన్నై పెరిఫెరల్ రోడ్ ప్రాజెక్టుతో సహా పదికి పైగా ప్రధాన పథకాలను 2027 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. మెట్రో రైలు విస్తరణ, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులను 2028 నాటికి, భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులను 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2029 నాటికి ప్రపంచ స్థాయి రహదారి మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు.భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకుని, రూ.10,000 కోట్ల పెట్టుబడితో 'గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఏఐ, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ వంటి రంగాలపై దృష్టి సారించే ఈ కేంద్రం ద్వారా 20,000 అధిక వేతన ఉద్యోగాలను సృష్టిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, వీధికుక్కల సమస్యకు శాస్త్రీయ పరిష్కారంగా, యానిమల్ బెర్త్ కంట్రోల్ కార్యక్రమాన్ని బలోపేతం చేస్తామని, వెటర్నరీ వైద్యులు, డాగ్ క్యాచర్ల సంఖ్యను మూడు రెట్లు పెంచుతామని తెలిపారు. వీటితో పాటు, మెట్రో వాటర్ కనెక్షన్లు లేని ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు, అన్ని నివాస ప్రాంతాల్లో హై-ఇంటెన్సిటీ వీధి దీపాలు వంటి హామీలను కూడా ఈ మేనిఫెస్టోలో పొందుపరిచారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
ఏప్రిల్ | సోమవారం | 20 | 2026



# మానవత్వం చాటుకున్నా మంత్రి నారా లోకేష్!

**విదేశాల నుండి ఖరీదైన ఇంజక్షన్ తెప్పించిన మంత్రి లోకేష్!**

**మన దునియా,అమరావతి:ఏప్రిల్ 18**

కొన్ని నెలలుగా సోషల్ మీడియాలో సేవ్ పునర్వి క" అంటూ విస్తృతంగా ప్రచారం సాగింది. లక్షలాది మంది స్పందించి తమవంతు సాయం అందించగా, మరికొందరు ప్రార్థనలతో మద్దతు తెలిపారు. చిన్నారి ప్రాణాలను కాపాడేందు కు అవసరమైన ఖరీదైన ఇంజెక్షన్ కోసం విరాళాలు వెల్లువలా వచ్చాయి. ఇంకా అవసరమైన నిధుల సమీకరణలో మంత్రి నారా లోకేష్ ముందుకు వచ్చి పూర్తి బాధ్యత తీసుకున్నా రు. అవసరమైనంత సాయం అందిస్తానని హామీ ఇచ్చి, ఆ మాటను నిలబెట్టుకున్నారు.... పునర్వికకు అవసరమైన చికిత్స కోసం విదేశాల నుంచి రూ.16 కోట్ల విలువైన జీన్ థెరపీ ఇంజెక్షన్ రప్పించడంలో మంత్రి లోకేష్ కీలక పాత్ర పోషించారు. చికిత్స సమయంలో కూడా ఆయన ఆసుపత్రిలోనే ఉండి చిన్నారికి మద్దతుగా నిలిచారు. ప్రజల ఆశీస్సు లతో చిన్నారి ఆరోగ్యం మెరుగుపడుతుండగా, ఆమె చిరునవ్వు తిరిగి కనిపించడం కుటుంబానికి ఆనందం కలిగించింది..అరుదైన స్పైనల్ మస్క్యు లర్ అట్రోఫీ వ్యాధితో బాధపడుతున్న పునర్వికకు ఈ చికిత్స ప్రాణాధారంగా నిలిచింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని రెయిన్ బో పిల్లల ఆసుపత్రిలో అమెరికా నుంచి తెప్పించిన జోల్ జెన్ స్మా ఇంజెక్షన్‌ను వైద్యులు మంత్రి లోకేష్ సమక్షంలో ఈరోజు అందించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, వైద్యులతో చికిత్స వివరా లు తెలుసుకున్నారు. చిన్నారి ఆరోగ్యం పట్ల అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



**రూ.16 కోట్ల ఇంజెక్షన్ ఒక్కటే ఆశ**

కర్నూలు జిల్లా వెల్దుర్తికి చెందిన ఏడాది వయసున్న పునర్విక ఈ ప్రాణాంతక వ్యాధితో బాధపడుతోంది. తండ్రి సురేష్ కుమార్ సాధారణ జీవనం సాగిస్తున్న నేపథ్యంలో కుటుంబానికి ఈ ఖరీదైన చికిత్స భారం అయ్యింది. మొదట స్థానికంగా చికిత్స చేయించినా, తరువాత హైదరాబాద్‌లో పరీక్షలు చేయించగా ఎస్ఎంఎస్ టైప్-1 అని నిర్ధారణ అయ్యింది. ఈ వ్యాధికి ఒక్కసారి మాత్రమే ఇచ్చే జీన్ థెరపీ ఇంజెక్షన్ మాత్రమే పరిష్కారమని వైద్యులు సూచించారు.

# జూన్ 2 నుంచి రైళ్లలో పురుషులకు ఉచిత ప్రయాణం?

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 18**

హైదరాబాద్ మహానగరం లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది, జూన్ 2 నుంచి ఎంఎంటిఎస్,రైళ్లలో ఉచిత అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది, నగరవ్యా ప్తంగా నడిచే ఎంఎంటీఎస్ రైళ్లలో మహిళలు, పురు షులు అనే తేడా లేకుండా అందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనుంది. జూన్ 2వ తేదీ నుంచి ఈ చారిత్రాత్మక పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. భాగ్య నగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు, సామాన్యుడిపై రవాణా భారాన్నితగ్గించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణ పథకానికి ఆయన ఆమోదం తెలిపారు. తెలంగాణ ఆవిర్భావది నోత్సవ కానుకగా జూన్ 2 నుంచి ఏడాది పాటు ప్రయోగాత్మకంగా ఈ పథకాన్ని అమలు చేయ నున్నారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు.ప్రస్తుతం ఎంఎంటీఎస్ ద్వారా రైల్వే శాఖకు




ఏడాదికి సుమారు రూ. 10 కోట్ల ఆదాయం వస్తోంది. ఉచిత పథకం వల్ల ప్రయాణికుల సంఖ్య ఎంత పెరిగినా, రైల్వేకు వచ్చే ప్రస్తుత ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు ప్రభుత్వం అధికారికంగా లేఖ రాసింది.

# ఏపీకి కొత్త రైల్వే లైన్లు... కేంద్రానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు

**ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదంకి**
**నిడదవోలు-దువ్వాడ మధ్య 3వ, 4వ లైన్లకు గ్రీన్ సిగ్నల్**
**కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన సీఎం చంద్రబాబు**
**పారిశ్రామిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి ప్రాజెక్టు దోహదం చేస్తుందని వెల్లడి**
**గోదావరిపై 4.3 కిలోమీటర్ల పొడవైన రైల్వే వంతెన నిర్మాణం**

**మన దునియా,ఆంధ్రప్రదేశ్:ఏప్రిల్ 19**

ఆంధ్రప్రదేశ్‌కు కీలకమైన రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీకి ఆయన ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. రాజమండ్రి సమీపంలోని నిడదవోలు నుంచి విశాఖపట్నం సమీపంలోని దువ్వాడ వరకు 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై 4.3 కిలోమీటర్ల పొడవైన రైల్వే వంతెన నిర్మించనున్నారని చంద్రబాబు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. దీనివల్ల ఆ మార్గంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, ప్రయాణ సమయం ఆదా అవుతుందని వివరించారు. ఈ కొత్త లైన్లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను అనుసంధానిస్తూ ప్రయాణికులకు,





సరుకు రవాణాకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. అంతేకాకుండా, అన్నవరం, అంతర్వేది, ద్రాక్షారామం వంటి ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలకు వెళ్లే భక్తులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి, ఓడరేవు ఆధారిత ఆర్థిక వ్యవస్థల అభివృద్ధికి కీలకమని అభిప్రాయపడ్డారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల సాధన దిశగా ఈ ప్రాజెక్టులు మరో ముందడుగు అని చంద్రబాబు పేర్కొన్నారు.

# హిందువులంతా మరింత ఐక్యం కావాలి: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్..

**మన దునియా,నిజామాబాద్: ఏప్రిల్ 19**

నిజామాబాద్: హిందువులను సంఘటితం చేసేందుకే స్వయం సేవక్ సంఘ్‌ను కేశవ్ బలీరాం హెడ్గేవార్ స్థాపించారని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. హిందువులంతా మరింత ఐక్యం కావాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. కందకుర్తి దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. రెంజల్ మండలం కందకుర్తిలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పర్యటించారు. ఈ సందర్భంగా కేశవ్ స్ఫూర్తి మందిరం ప్రారంభోత్సవంలో భగవత్ పాల్గొన్నారు. మందిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్ఫూర్తి కేంద్రాన్ని ప్రతి ఒక్క హిందువు సందర్శించాలని భగవత్ విజ్ఞప్తి చేశారు. చరిత్రను భవిష్యత్తు తరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. బ్రిటిష్ పాలకులను భారత్ నుంచి తరిమికొట్టాలని హెగ్డేవార్ తపన పడ్డారని, ఆ కల నెరవేరిందని మోహన్ భగవత్ తెలిపారు..



# తెలంగాణలో 9 మంది ఐపీఎస్ అధికారుల బదిలీలు!


**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 18**



తెలంగాణ లో పలువురు ఐపీఎస్, అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది, ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు శని వారం రాత్రి ఉత్తర్వులను జారీ చేశారు. ఆసిఫాబాద్ ఏఎస్పీ ఎస్.చిత్తరంజన్‌ను అదే జిల్లాలో అదనపు ఎస్పీ అడ్మిన్‌గా నియమించారు. కామారెడ్డి ఏఎస్పీ బొక్కా చైతన్యరెడ్డిని సంగారెడ్డి అదనపు ఎస్పీగా, జనగామ ఏఎస్పీ పందిరి చేతన్ నితిన్‌ను జగిత్యాల ఏఎస్పీగా బదిలీ చేశారు. భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్‌ను మెదక్ ఏఎస్పీగా, వరంగల్ ఏఎస్పీ నగ్రాలె శుభమ్ ప్రకాశ్‌ను నిజామాబాద్ అదనపు డీసీపీగా, భైంసా అదనపు ఎస్పీ రాజేశ్ మీనాను వనపర్తి ఏఎస్పీగా నియమించారు. అలాగే ఆదిలాబాద్ ఏఎస్పీ పి.మౌనికను ఆదిలాబాద్ అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) గా, నిర్మల్ ఏఎస్పీ పత్తిపాక సాయికిరణ్‌ను భైంసా ఏఎస్పీ ఎస్‌డీపీఓగా, వేములవాడ ఏఎస్పీ రుత్విక్‌సాయిని ఉట్నూర్ ఏఎస్పీ ఎస్‌డీపీఓ,గా బదిలీ చేశారు

# రాష్ట్రమంతా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 19**



భానుడి భగభగలతో రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే ఎక్కువగా నమోదయ్యాయి. ఎండ తీవ్రతతో వడదెబ్బ బారిన పడి ఇద్దరు వృద్ధులతోపాటు నలుగురు వ్యక్తులు మరణించారు. మరో రెండు రోజులపాటు పగటి ఉష్ణోగ్రతల్లో ఎటువంటి మార్పు ఉండబోదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కుమరం భీమ్ - ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లా బుట్టాపూర్, నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలుగా నమోదైంది. ఈ ఏడాది వేసవిలో అత్యధిక పగటి ఉష్ణోగ్రత నమోదు కావడం ఇదే ప్రథమం. కాగా, వివిధ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలపైనే రికార్డయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 104 ప్రాంతాల్లో వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. కాగా, ఆది, సోమవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. మానేరు నది సమీపాన పెద్దపల్లి జిల్లా మంథని మండలం చిన్న ఓదెల వాసి దాసరి రమేశ్ (50).. రాజన్న-సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వెంకట్రావ్‌పల్లి వాసి నల్లాల మోహన్ (46) ఇంటి నిర్మాణ పనులు చేస్తూ వడదెబ్బ గురై మరణించారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం అడవి లింగాల వాసి లింగాల రాములు (59) పొలానికి నీరు పెట్టడానికి వెళ్లి గట్టుపైనే సొమ్మసిల్లి పడిపోయాడు.వరంగల్ జిల్లా నర్సంపేట మండలం బోజ్యా నాయక్ తండా వాసి భూక్య జంకు (65) శనివారం మధ్యాహ్నం తోటలో పని చేస్తుండగా ఎండదెబ్బకు గురై కుప్పకూలడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. నిజామాబాద్, రాజన్న-సిరిసిల్ల, సంగారెడ్డి, హైదరాబాద్‌లోని పలు చోట్ల వర్షం కురిసింది. నిజామాబాద్ జిల్లా సిరికొండ, ధర్పల్లి, ఇందల్‌వాయి మండలాలు, సిరిసిల్లలోని కోనారావుపేట మండలంలో కురిసిన అకాల వర్షం వల్ల ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. రోడ్లపై చెట్లు విరిగి పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతోపాటు సాయంత్రం కురిసిన వర్షంతో సంగారెడ్డి జిల్లా వాసులు ఊపిరి పీల్చుకున్నారు..

# హైదరాబాద్‌లో భారీ వర్షం.. పలు ప్రాంతాలు జలమయం

**మన దునియా,హైదరాబాద్: ఏప్రిల్ 19**




హైదరాబాద్:నగరంలో పలుచోట్ల భారీ వర్షం కురుస్తోంది. కొన్ని చోట్ల ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన పడుతోంది. నిజాంపేట్, కేపీహెచ్బీ, బోయిన్‌పల్లి, జీడిమెట్ల, బాలానగర్, జగద్గిరిగుట్ట, షాపూర్‌నగర్‌లో భారీ వర్షం కురుస్తోంది. అలాగే సూరారం, దుండిగల్, గండిమైసమ్మ, సికింద్రాబాద్, తిరుమలగిరి, అల్వాల్, ప్యాట్నీ, ప్యారడైజ్, మారేడ్‌పల్లిలోనూ ఈదురుగాలులతో కూడిన వాన దంచికొడుతోంది. చింతల్‌లో ఈదురుగాలులకు ఓ భారీ వృక్షం నేలకొరగగా.. రెండు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు, వృక్షాలు పడిపోవడంతో పలు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. కూకట్‌పల్లి, మూసాపేట్, జేఎన్టీయూ ప్రాంతాల్లో వడగళ్ల వాన పడుతోంది. నిజాంపేట్, కేపీహెచ్బీ, బోయిన్‌పల్లి, జీడిమెట్లలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ వర్షాలకు పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి..

RNI Number

మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

# హిందూ సమ్మేళన పోస్టర్ ఆవిష్కరణ

**రామ్ మందిర్ బస్తీ షాద్ నగర్**

**హిందూ సమ్మేళన ఆహ్వానం**

**మన దునియా,షాద్నగర్:ఏప్రిల్ 19**



రండి కదలిరండి ప్రతి హిందూ గడపగడపకి ఆహ్వానం హిందువుల ఐక్యమత్యమే ఈ దేశానికి బలం, షాద్నగర్ పట్టణంలోని పటేల్ రోడ్, నెహ్రూ నగర్ కాలనీ, గాంధీ నగర్ కాలనీ, సావర్కర్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, ఆఫీసర్స్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, నోబెల్ పార్క్, బృందావన్ కాలనీ, లలో నివాసముండే ప్రతి హిందూ బంధువులు మన ఐక్యతను చాటేందుకు ప్రతి ఒక్క హిందూ కుటుంబం సమేతంగా తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరుతున్నాం. తేదీ 25/ 04/ 26 శనివారం సాయంత్రం 4 గంటలకు శివమారుతి దేవాలయం నుండి మహిళా మూర్తులతో కలశ భగవత్ ధ్వజం ఊరేగింపుగా ఠాగూర్ స్కూల్ ఆడిటోరియం వరకు ఊరేగింపుగా వచ్చి హిందూ సమ్మేళనం కార్యక్రమ 5 గంటల నుండి టాగూర్ స్కూల్ ఆడిటోరియం లో నిర్వహించడం జరుగుతుంది కాబట్టి హిందూ బంధువులు అత్యధిక సంఖ్యలో కుటుంబ సమేతంగా తరలిరండి జై శ్రీరామ్, హిందూ సమ్మేళన కమిటీ సభ్యులు కమలాకర్ జీ,స్వరాజ్ బాబు, బాలకిషన్, మరాటి ప్రవీణ్,నర్సింలు, చెట్ల వెంకటేష్, పి కృష్ణారెడ్డి, నరేందర్, సుధాకర్ రెడ్డి, నరసింహ చారి, ప్రకాష్, యాదయ్య, నరేష్, మాధగోని మల్లేష్, హరీష్ శర్మ, పాల్గొన్నారు...

# పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి తప్పిన ముప్పు..

**కుల్కచర్లలో డ్రోన్ ప్రదర్శనలో అపశృతి!**




**మన దునియా,వికారాబాద్ జిల్లా,కుల్కచర్ల:ఏప్రిల్ 19**

వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో ఈరోజు అనూహ్య ఘటన చోటు చేసుకుంది. పరిగి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డికి తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల కోసం కొత్తగా కొనుగోలు చేసిన డ్రోన్ ప్రదర్శన నిర్వహిస్తుండగా, అది ఒక్కసారిగా అదుపు తప్పి ఎమ్మెల్యే బృందంపైకి దూసుకువచ్చింది.

అసలేం జరిగిందంటే?

రైతులు వ్యవసాయ పనుల కోసం ఉపయోగించే డ్రోన్ పనితీరును పరిశీలించేందుకు కుల్కచర్లలో ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఈ డ్రోన్ ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. డ్రోన్ గాలిలోకి ఎగిరిన కొద్దిసేపటికే సాంకేతిక లోపంతో ఆపరేటర్ నియంత్రణ కోల్పోయారు. దీంతో ఆ డ్రోన్ వేగంగా నేరుగా ఎమ్మెల్యే, అక్కడ ఉన్న నాయకుల వైపు దూసుకొచ్చింది.ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి డ్రోన్ రెక్కలు బలంగా తగలడంతో ఎమ్మెల్యే కాలికి గాయమైంది. స్థానిక నేత తిరుమలపూర్ వెంకటయ్య గౌడ్ కాలికి కూడా దెబ్బతగిలి రక్తస్రావమైంది. రాంపూర్ సర్పంచ్ తిరుపతయ్యకు చేతి బొటనవేలు తెగిపోయింది.ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన కార్యకర్తలు, అనుచరులు బాధితులను హుటాహుటిన పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే సహా మిగిలిన ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. సాంకేతిక లోపం వల్ల జరిగిన ఈ అపశృతితో ఒక్కసారిగా కుల్కచర్లలో కలకలం రేగింది. ఎమ్మెల్యేకు పెద్ద ప్రమాదం తప్పడంతో ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు..

# టాలీవుడ్‌లో విషాదం.. ఆ ఎడిటర్ కన్నుమూత!

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 19**




తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. టాలీవుడ్‌లో ఎన్నో చిత్రాలకు ఎడిటర్‌గా పని చేసిన ఎడిటర్ మధు రెడ్డి, హైదరాబాద్‌లోని మణికొండలో ఏప్రిల్ 18న గుండెపోటుతో ఆకస్మికంగా కన్నుమూశారు. మధు రెడ్డి మరణవార్త తెలిసి.. ఆయన సహచరులు, స్నేహితులు, ఆయనతో కలిసి పనిచేసిన సినీ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. మధు రెడ్డి ఆకస్మిక మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటని చెబుతూ.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులు అర్పిస్తున్నారు. కరీంనగర్‌కు చెందిన మధు రెడ్డి, తెలుగు సినిమా పరిశ్రమ లో ఎన్నో చిత్రాలకు ఎడిటర్‌గా పని చేసి, తనదైన గుర్తింపును పొందారు. ఎడిటర్‌గా ఆయనకు ఇండస్ట్రీలో మంచి పేరుంది. సినిమాలోని ఎమోషన్, రిథమ్ వంటి విషయాలను అర్థం చేసుకొని ఎడిటింగ్ చేయడంలో ఆయనకు మంచి పట్టు ఉంది. 'దళం', 'దక్ష', 'అహ నా పెళ్ళంట' వంటి చిత్రాలకు ఆయన ఎడిటర్‌గా బాధ్యతలను నిర్వహించారు. త్వరలోనే విడుదలకానున్న 'అగ్ని నక్షత్రం' చిత్రానికి కూడా ఆయనే ఎడిటర్. కేవలం ఫీచర్ ఫిలిమ్స్‌కు మాత్రమే కాకుండా.. వందలాది చిత్రాలకు ట్రైలర్ ఎడిటర్‌గా కూడా పనిచేశారు. 'జగడం', 'జల్సా' వంటి బ్లాక్ బస్టర్ సినిమాలకు ట్రైలర్ కట్ చేసింది మధు రెడ్డినే. సినిమా సమీక్షలు మధు రెడ్డి గురించి తెలిసిన వారంతా.. తన వృత్తి పట్ల ఎంతో అంకితభావం, ఎప్పుడూ ఒదిగి ఉండే మనస్తత్వం ఆయన సొంతమని చెబుతున్నారు. ఆయన వర్క్‌లో ఎప్పుడూ ఒక స్పష్టత ఉంటుందని, అలాంటి వ్యక్తి చిన్న వయసులోనే దూరం కావడం బాధాకరం అంటూ, కన్నీటి పర్యంతమవుతున్నారు..

# జగన్ నుంచి ఏబీఎన్ ఎండీ రాధాకృష్ణకు ప్రమాదం ఉంది: గోరంట్ల

**మన దునియా,ఆంధ్ర ప్రదేశ్:ఏప్రిల్ 19**




వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సంచలన వ్యాఖ్యలు చేశారు. హత్య రాజకీయాలకు జగన్ అలవాటు పడ్డారని విమర్శలు చేశారు. జగన్‌తో ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజా సమస్యలు వెలుగులోకి తీసుకొస్తున్న రాధాకృష్ణకు జగన్ నుంచి ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రాధాకృష్ణపై దాడి చేయించే ప్రమాదం ఉందని.. అందుకే జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

**తండ్రిని అడ్డుపెట్టుకొని పరిటాల రవిని హత్య చేయించారు..**

ఈరోజు(ఆదివారం) రాజమండ్రిలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తండ్రిని అడ్డుపెట్టుకొని పరిటాల రవిని హత్య చేయించిన చరిత్ర జగన్‌దని ఎద్దేవా చేశారు. పరిటాల రవి చుట్టూ ఉన్న అనేక మందిని హత్యలు చేయించారని ఆరోపించారు. జగన్ తన తాత రాజారెడ్డి నుంచి హత్యా రాజకీయాలను వారసత్వంగా పుణికిపుచ్చుకున్నారని సెటైర్లు గుప్పించారు. అధికారం కోసం జగన్ సొంత బాబాయి వివేకానందరెడ్డినే హత్య చేయించి కేసులు మాఫీ చేయించుకునేందుకు కుట్రలకు పాల్పడ్డారని విమర్శించారు.

**చంద్రబాబును జైల్లో పెట్టించిన దుర్మార్గుడు జగన్..**

జగన్ చేస్తున్న కుట్రలను ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి 54 రోజులు జైల్లో పెట్టించారని ధ్వజమెత్తారు. చంద్రబాబును జైల్లో పెట్టించిన దుర్మార్గుడు జగన్ అని ఆగ్రహించారు. ఆస్తికోసం చెల్లిని, తల్లిని దూరం పెట్టారని దుయ్యబట్టారు. ఆయన లాంటి రాక్షసుడు మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంతో పాటు దేశమే నాశనం అవుతుందని విమర్శించారు. జగన్ పొరపాటున కూడా మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని, ప్రజలు రానివ్వరని గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పష్టం చేశారు..

# సిర్సపల్లి ఐలోని మల్లన్న సాక్షిగా డంపింగ్ యార్డ్, ఉపసంహరించుకోవాలి,

**ఒగ్గు డప్పు కళాకారుల, బోనాలు,మహిళా కోలాట బృదాలతో మార్మోగిన పల్లె**

**మల్లన్న పట్నాలతో గర్జించిన ప్రజలు, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , ప్రజ ప్రతినిధుల మద్దతు,**

**మన దునియా హుజురాబాద్ నియోజకవర్గం**



హుజురాబాద్ మండలం సిర్సపల్లి గ్రామంలోని మల్లన్న దేవాలయం సమీపంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ప్రజలు భారీగా మల్లన్న పట్నాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్,బి ఆర్ ఎస్, ఎమ్మెల్యే పాల్గొని ప్రజల ఆందోళనకు మద్దతు తెలిపారు.ఇటీవల సిర్సపల్లి ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుపై ఇప్పటికే బంద్‌లు, నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ పోరాటం మరింత ఉధృతమైంది.

దేవాలయ పవిత్రతకు భంగం అనుమతించము.హెచ్చరించారు,

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మల్లన్న దేవాలయం పవిత్రతకు భంగం కలిగించే విధంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం అసలు అంగీకరించలేమని స్పష్టం చేశారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**కాలుష్యం,ప్రజల ఆరోగ్యంపై ముప్పు**

డంపింగ్ యార్డ్ వల్ల దుర్వాసన, కాలుష్యం పెరిగి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇదే అంశాన్ని స్థానిక నిరసనల్లో కూడా ప్రజలు వ్యక్తం చేస్తూ వచ్చారని సమాచారం.

**రైతులకు, భూగర్భ జలాలకు ప్రమాదం**

భూగర్భ జలాలు కలుషితం కావడం వల్ల తాగునీటి సమస్యలు తలెత్తుతాయని, పంట భూములు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు.

**ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక**

ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, దేవాలయ పవిత్రత అన్నీ ముఖ్యమైనవి. ప్రజలకు నష్టం కలిగించే డంపింగ్ యార్డ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలి. అవసరమైతే ప్రజలతో కలిసి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో మహిళలు, రైతులు, యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని డంపింగ్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలని ఒకే స్వరంతో డిమాండ్ చేశారు.

# తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై టీపీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

**మన దునియా,నిజామాబాద్, ఏప్రిల్ 13.**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఇబ్బందులు ఉన్న విషయం పోచారం శ్రీనివాస్ రెడ్డికి తెలుసని అన్నారు. కొంచెం ఓపిక పట్టాలని, త్వరలోనే అన్నీ సర్దుకుంటాయని స్పష్టం చేశారు. కేటీఆర్ రెండు విషయాలు స్పష్టంగా ఒప్పుకున్నారని.. దోపిడీ దౌర్జన్యం చేశామని అంగీకరించారని మహేశ్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పాదయాత్ర చేయవచ్చని.. స్వాగతిస్తామని తెలిపారు. అయితే పాదయాత్రలో ప్రజలకు వాస్తవాలు చెప్పాలని సూచించారు. గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని టీపీసీసీ చీఫ్ ఆరోపించారు. సింగరేణిలో విద్యుత్ కొనుగోళ్లలో బీఆర్ఎస్ అవినీతి చెరిపేస్తే చెదిరేది కాదని వ్యాఖ్యానించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి భారతీయ జనతా రాష్ట్ర సమితిగా మార్చినా తమకు ఇబ్బంది లేదని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదని ధీమా వ్యక్తం చేశారు. కవితకు తమకు ఏంటి సంబంధం అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పార్టీ పెట్టుకున్నా స్వాగతిస్తామన్నారు. వారి కుటుంబ వాటాల పంచాయితీని తమపై అంటగట్టవద్దని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు..



# స్కూల్ పరిసరాల్లో సిగరెట్, గుట్కా నిషేధం

**మన దునియా,హైదరాబాద్: ఏప్రిల్ 19**

హైదరాబాద్ ఆపరేషన్ సేఫ్ స్కూల్ పేరుతో విద్యాసంస్థల దగ్గర ఉండే పాన్ షాపుల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జబార్ తెలిపారు. హైదరాబాద్ టాస్కోర్స్,స్పెషల్ టీం, హెచ్ న్యూ మొత్తం 5000 మంది సిబ్బంది ఈ రైడ్ లో పాల్గొన్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో ఉన్న 500కు పైగా పాన్ పాపుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్లలోపు పొగాకు ఉత్పత్తులు విక్రయించ కూడదని సీపీ సజ్జనార్ ఆదేశించారు. అలా విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారని తమకు పలు ఫిర్యాదులు అందుతున్నాయని ప్రస్తావించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెంది తమకు విద్యాదులు చేశారని సీపీ సజ్జనాద్ పేర్కొన్నారు. తమ పోలీస్ సిబ్బంది కూడా కిరాయ్ ఆపరేషన నిర్వహించారని.. పొగాకు ఉత్పత్తులు స్కూటి విద్యార్థులకు అమ్ముతున్నట్లు తమ విచారణలో నేలిందని చెప్పుకొచ్చారు. సూళ్ల వద్ద కొన్ని రోజుల నుంచి నిఘా పెట్టారుని.. ఈరోజు




ఐదు వేలమంది పోలీసులతో స్పెషల్ డ్రైవ్ సజ్జనార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్వహించానని తెలిపారు. పొగాకు ఉత్పత్తులను విద్యార్థులు తీసుకోవడం మొదలు పెడితే డ్రగ్స్ వైపు అవకాశం ఉంటుందని అన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని సీపీ సజ్జనార్ పేర్కొన్నాడు. బ్యాన్ అయిన పాన్ మసాలాలు, గుట్కాలు వంటివి ఎవరైనా అమ్ముతున్నారా అనే విషయాలపై అరా తీస్తున్నారు.

# నూతన పరిజ్ఞానంతో ఊపిరితిత్తుల వ్యాధి నివారణ

**యశోద ఆసుపత్రి డాక్టర్ నాగార్జున మాటూరి**

**పలమనాలజీ వైద్య విధానంలో నూతన మార్పులు**

**మన దునియా,వరంగల్ జిల్లా: ఏప్రిల్ 19**

పల్మనాలజీ వైద్య సేవలు పొందాలంటే దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలలో మాత్రమే వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని అలాంటి సందర్భంలో తెలంగాణలో మొట్టమొదటిసారి వరంగల్ జిల్లాలోని పల్మనాలజీ వైద్య సేవలు నూతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి యాజమాన్యం హైదరాబాద్ మరియు వివిధ రాష్ట్రాల నుండి పల్మనాల దృష్టిలో ప్రతిభ కనబరిచిన వైద్య బృందం వరంగల్ వైద్య బృందానికి అందుబాటులోకి తీసుకొచ్చిందని డాక్టర్ నాగార్జున మాటూరి తెలిపారు. ఆదివారం హంటర్ రోడ్డు లోని పోడెం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించబడిన వైద్య పరికరాల ఎక్స్పో ను నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాటూరి మాట్లాడుతూ మానవ శరీరంలోని ఉండి కాలేయము మూత్రపిండాలు వంటి వ్యాధుల బారిన పడిన రోగులకు నూతన పరిజ్ఞానంతో రూపొందించబడిన అత్యాధునిక యంత్రాలను వైద్యులకు అవగాహన కల్పిస్తూ అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వెంటిలేటర్ చికిత్స అందించే క్రమంలో ప్రస్తుత విధానాలను అనుసరిస్తున్న వైద్యులకు ఉన్నతశ్రేణి పరికరాలను అమర్చి వైద్యాన్ని సులువుగా అందించే కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గడచిన పది సంవత్సరాల కాలంలో ఎక్కువ శాతం ఊపిరితిత్తుల వ్యాధి రోగుల సంఖ్య ఎక్కువగా పెరిగిందని అదే క్రమంలో కోవిడ్ ముందు కోవిడ్ కు తర్వాత రెండు రూపాంతరాలుగా ఊపిరితిత్తుల పనితీరులో ఎన్నో మార్పులు సంభవించాయని అన్నారు. దీనికి కారణం జనాభా పెరగడం, కాలుష్యం విస్తరించడం వల్ల రోగుల సంఖ్య అధికమైందని దానికి భిన్నంగా ప్రజల లైఫ్




స్టైల్ లో ఎన్నో మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. చెడలవాట్లు, మత్తు నీయాలు తీసుకోవడం వల్ల ఊపిరితిత్తుల పనితీరు పూర్తిస్థాయిలో క్షీణించడం తద్వారా రోగుల సంఖ్య పెరిగిపోయింది అన్నారు. ఐ ఎల్ డి సి ఓ పి డి వంటి రోగాల బారిన పడి ఎంతో మంది చనిపోతున్నట్లు వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో శరీర అవయవాల పనితీరును మెరుగుపరిచే విధానాన్ని అవలంబించి నూతన పరిజ్ఞానంతో రూపొందించబడిన వైద్య పరికరాలను వివిధ కంపెనీలు రూపొందించాయని ఆయన తెలిపారు. ఉదాహరణకు క్యాన్సర్ వస్తే ప్రాణానికి ముప్పు అని అనుకునే పరిస్థితుల్లో రోహిణి ఆన్సర్ భారీ నుండి కాపాడే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ టెక్నాలజీ వాడుతున్నట్టు తెలిపారు. అంతేకాకుండా లంగ్స్ కు సంబంధించి హెల్త్ కేర్ పరిజ్ఞానంతో సూక్ష్మ తరహా బ్యాక్టీరియాను కనిపెట్టవచ్చన్నారు. 8 మిల్లీమీటర్ల పరిణామములో ఉన్న అతి చిన్న సూక్ష్మ తీరియను నిర్ధారించి సరైన పరీక్షలను నిర్వహించే పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఈ సదస్సులో వివరించారు. ఐఎండిస్, సి ఓ పి డి వంటి వాటికి కొత్త టెక్నాలజీ రూపొందించబడింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్ పలమనాలజీ కన్సల్టెంట్, ఐ సి ఓ వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

# అల్పాహారం పథకాన్ని వంట కార్మికులతో కాకుండా ఇతరత్రా ప్రైవేట్ సంస్థలతో నిర్వహించినట్లయితే అడ్డుకుంటాం

**అల్పాహారం పాత బిల్లులు పూర్తిగా విడుదల చేయాలి ఏఐటీయూసీ**

**ములుగు జిల్లా ఏప్రిల్ 19 మన దునియా**

ములుగు జిల్లాలో ఎస్ ఎస్ తాడ్వాయి మండలం లో ని మేడారంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ వాజేడు మండలం సమితి సమావేశం మేడారంలో అల్లి అమృత అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ గారు మాట్లాడుతూ వంట కార్మికులు 24 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకంలో వంట కార్మికులుగా సొంత డబ్బులు పెట్టుకొని వంటలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందిస్తూ ఆ బిల్లులు నెలల తరబడి పెండింగులు ఉన్న అలాగే కొనసాగుతూ నిర్వహిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టాలని అన్నారు అలాగే అల్పాహారం పథకం 2023 24 సంవత్సరములు నిర్వహించిన బిల్లులు ఒక్కొక్క కార్మికురాలుకు లక్షకు తక్కువ కాకుండా బిల్లులు ఇప్పటివరకు విడుదల చేయలేదు అన్నారు ఆ బిల్లులు పెండింగ్లో ఉండగానే ఈ సంవత్సరం జూన్ నుండి మళ్ళీ పథకం ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించడం చూస్తుంటే ఇది కేవలం ఆర్భాటాలకు మాత్రమే తప్ప విద్యార్థులను మభ్యపెట్టడానికే అన్నారు గతంలో పెండింగ్ విలువలు అన్ని వెంటనే విడుదల చేయాలి అలాగే అల్పాహారం పథకాన్ని ప్రస్తుతం ఉన్న వంట కార్మికులతో మాత్రమే నిర్వహించాలని అలా కాకుండా ఇతరత్రా ఏదైనా ఎన్జీవో సంస్థలతో నిర్వహించడానికి ప్రయత్నం చేస్తే రాష్ట్రంలో ఉన్న 54,200 మంది వంట కార్మికులం అడ్డుకుంటా మని హెచ్చరించారు అలాగే ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూపాయలు పదివేల వేతనాలు వెంటనే చెల్లించాలని వంట సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు పాఠశాలను ప్రారంభించే వరకే ఇవన్నీ అమలు చేయాలని లేనియెడల పాఠశాలలు ప్రారంభం నుండి సమ్మెకు వెళ్లవలసి ఉంటుందని హెచ్చరించారు ఈ సమావేశంలో పాల్గొన్నవారు అల్లి అమృత టేకుల సంతోష్ నాగమణి సమ్మక్క నాగమణి జయలక్ష్మి శంకరమ్మ అరుణ సరిత నర్సమ్మ పార్వతి సరోజన బతుకమ్మ రాధ గంగ కాంత రమాదేవి తిరుపతమ్మ మల్లేశ్వరి ప్రమీల ఈస్వరి శాంత నర్సమ్మ సమ్మక్క శాంత తదితరులు పాల్గొన్నారు



# భార్యను గోడకేసి కొట్టి కిరాతకంగా చంపిన భర్త

**మన దునియా,అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం:ఏప్రిల్ 19**



అన్నమయ్య జిల్లాలో భర్త తన భార్యను కిరాతకంగా కొట్టిచంపేసిన అమానుష ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పీలేరు నియోజకవర్గం, వాల్మీకి పురానికి చెందిన జగదీష్ మౌనిక దంపతులు, స్థానికంగా టీషాపు నిర్వహించి కుటుంబాన్ని పోషించుకునే వారు. ఇటీవల షాపు నిలిపేసి ఉద్యోగం కోసం బెంగళూరుకి వెళ్లారు. అక్కడ ఏం జరిగిందో ఏమో.. తిరిగే వాల్మీకిపురానికి ఆదివారం మధ్యాహ్నం వచ్చి భార్యను గడకేసి కొట్టి చంపేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. అయితే తాను తన భార్యను చంపేశానని నిందితుడు పోలీస్ స్టేషన్కు వచ్చి లొంగిపోయినట్లు సమాచారం...

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం ఎయిడ్ సంస్థ జిల్లా బాధ్యులు వగ్గు సోమన్న

**పెన్ పహాడ్, ఏప్రిల్ 19మన దునియా**




బల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ జిల్లా బాధ్యులు వగ్గు సోమన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని నాగులపాటి అన్నారం బెతేల్ చర్చిలో ఎయిడ్ సంస్థ అక్షయ తృతీయ కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 పై పాస్టర్లకు , అవగాహన కల్పించి బాల్య వివాహాలను నిర్మూలిద్దాం.బాలికల హక్కులను కాపాడుదామని ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ చట్టం ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు, మగవారికి 21 సంవత్సరాలు నిండకుండా వివాహాలు జరిపినా, ప్రోత్సహించినా వారికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారని తెలిపారు. బాల్యవివాహాలు జరుగుతున్నాయని తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ బిడ్డలు విమలమ్మ, శిల్ప, ప్రమీల, లక్ష్మమ్మ, సుధా, సామెల్, విజయమ్మ, సుజాత, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

# వాజేడు మండలంలోని జంగాలపల్లి మినీ గురుకులంలో 2026 -2027 సంవత్సరం బాలికలకు అడ్మిషన్లు ప్రారంభం

**మన దునియా వాజేడు ఏప్రిల్ 19**



ములుగు జిల్లా వాజేడు మండలం బాలికల మినీ గురుకులంలో 2026-2027 విద్యా సంవత్సరానికి ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల ప్రక్రియ మొదలైంది అని జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ హరి సింగ్ నాయక్ పాఠశాల ప్రిన్సిపాల్ జే. సుజాత తెలిపారు ఆరు సంవత్సరాల బాలికలకు అవకాశం ఉండగా ఒకటవ తరగతిలో 30 సీట్లు రెండవ తరగతిలో 9 బ్యాక్లాగ్ సీట్లు మూడవ నాలుగు తరగతిలో ఒకటి, ఐదువ తరగతిలో నాలుగు సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు ఏప్రిల్ 20 నుండి మే 5 . 5.2026 వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని వాజేడు వెంకటాపురం మండలాల విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు ఎంపిక విధానం డ్రా ద్వారా జరుగుతుందని ఎంపికైన వారికి ఉచిత భోజనం వసతి పుస్తకాలు దుస్తులు తదితర సౌకర్యాలు కల్పించబడతాయని పేర్కొన్నారు ఆసక్తి గల తల్లిదండ్రులు ఆధార్ కార్డు జనన ధ్రువీకరణ పత్రం కులం ఆదాయం సర్టిఫికెట్లు నాలుగు ఫోటోలు తీసుకొని పాఠాశాలలో దరఖాస్తు చేసుకోవాలని నిర్వహకులు కోరారు

# భద్రాది కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన వాసిరెడ్డి సాంబశివరావు

**మన దునియా, వాజేడు, ఏప్రిల్ 19**



హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరియు భద్రాచలం మాజీ శాసనసభ్యులు పోదేం వీరయ్య గారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేస్తా నని వాసిరెడ్డి సాంబశివరావు తెలిపారు ఈ సందర్భంగా ఉదయం వీరయ్య గారు మాట్లాడుతూ జిల్లాలోని కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలిచి పార్టీ కోసం అహర్నిశలు మించాలని వాసిరెడ్డి సాంబశివరావు సూచించారు కష్టపడ్డవాన్ని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు వదులుకోదని ఆయన అన్నారు

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
ఏప్రిల్ । సోమవారం । 20 । 2026



# పంజాబ్‌తో మ్యాచ్: టాస్ గెలిచిన లక్నో

**పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచిన లక్నో**

**ఫీల్డింగ్ ఎంచుకున్న కెప్టెన్ రిషభ్ పంత్**

**లక్నో జట్టులోకి సిద్ధార్థ్.. పంజాబ్ టీమ్‌లో మార్పులు లేవు**

**ఛేదనలో స్వేచ్ఛగా ఆడొచ్చని చెప్పిన పంత్**

**మొదట బ్యాటింగ్ చేయడం సవాల్‌గా తీసుకుంటామన్న శ్రేయస్ అయ్యర్**

మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. ఈ మ్యాచ్ కోసం లక్నో జట్టులో ఒక మార్పు జరిగింది. స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీ స్థానంలో లెఫ్టార్మ్ స్పిన్నర్ సిద్ధార్థ్‌కు తుది జట్టులో చోటు కల్పించారు. మరోవైపు, గత మ్యాచ్‌లో గెలిచిన పంజాబ్ కింగ్స్ ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగుతోంది.టాస్ గెలిచిన అనంతరం రిషభ్ పంత్ మాట్లాడుతూ.. “మేం ఛేదనకు మొగ్గు చూపుతున్నాం. లక్ష్య ఛేదనలో స్వేచ్ఛగా ఆడే అవకాశం ఉంటుంది. 200 పరుగులకు ఆడటం కంటే కొన్నిసార్లు 220 పరుగుల లక్ష్యంతో ఆడటం మంచిది“ అని తన వ్యూహాన్ని వివరించాడు. తన మోచేతి గాయం మెరుగైందని కూడా పంత్ స్పష్టం చేశాడు.మరోవైపు, పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. టాస్ ఓడిపోవడం గురించి పెద్దగా ఆలోచించడం లేదన్నాడు. “ఈ టోర్నీలో ఇప్పటివరకు మేం మొదట బ్యాటింగ్ చేయలేదు. ఇది మాకు మంచి సవాల్. మెరుగైన ప్రదర్శన చేయడమే మా లక్ష్యం“ అని పేర్కొన్నాడు.వరుస విజయాలతో పంజాబ్ కింగ్స్ మంచి ఫామ్‌లో ఉండగా, గత రెండు మ్యాచ్‌లలో ఓటమి పాలైన లక్నో సూపర్ జెయింట్స్ ఒత్తిడితో ఈ మ్యాచ్ ఆడుతోంది. పిచ్‌పై పచ్చిక ఉండటంతో ఫాస్ట్ బౌలర్లకు సహకారం లభించే అవకాశం ఉందని, మంచు ప్రభావం ఉండదని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఈ మ్యాచ్‌లో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది. లక్నో సూపర్ జెయింట్స్: మిచెల్ మార్ష్, ఐడెన్ మార్క్‌రమ్, రిషభ్ పంత్ (కెప్టెన్, వికెట్ కీపర్), ఆయుష్ బదోని, నికోలస్ పూరన్, ముకుల్ చౌదరి, మహమ్మద్ షమీ, అవేష్ ఖాన్, ప్రిన్స్ యాదవ్, ఎమ్. సిద్ధార్థ్, మొహిసిన్ ఖాన్. పంజాబ్ కింగ్స్: ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), ప్రియాంశ్ ఆర్య, కూపర్ కనోలీ, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), శశాంక్ సింగ్, నేహాల్ వధేరా, మార్కస్ స్టొయినిస్, మార్కో యాన్‌సెన్, జేవియర్ బార్ట్‌లెట్, అర్ష్‌దీప్ సింగ్, యజువేంద్ర చాహల్.



# ఈ సీజన్ లో ఎట్టకేలకు గెలుపు బోణీ కొట్టిన కేకేఆర్... రాజస్థాన్ పై థ్రిల్లింగ్ విక్టరీ

**రాజస్థాన్ రాయల్స్‌పై 4 వికెట్ల తేడాతో గెలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్**

**అజేయ హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించిన ఫినిషర్ రింకూ సింగ్**

**156 పరుగుల లక్ష్య ఛేదనలో 85 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన కేకేఆర్**

**కేకేఆర్ బౌలర్ల ధాటికి 155 పరుగులకే పరిమితమైన రాజస్థాన్**

**వరుణ్ చక్రవర్తి, కార్తీక్ త్యాగి చెరో మూడు వికెట్లతో విజృంభణ**

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) అద్భుత విజయాన్ని అందుకుంది. టాపార్డర్ కుప్పకూలిన క్లిష్ట పరిస్థితుల్లో ఫినిషర్ రింకూ సింగ్ (53లి) అజేయ హాఫ్ సెంచరీతో చెలరేగడంతో, రాజస్థాన్ రాయల్స్‌పై 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో, ఎట్టకేలకు ఈ సీజన్ లో కేకేఆర్ తొలి విజయం అందుకుంది. టోర్నీలో ఇప్పటిదాకా 7 మ్యాచ్ లు ఆడిన కోల్ కతా జట్టు 5 మ్యాచ్ ల్లో ఓడి, ఒకదాంట్లో నెగ్గింది. ఒక మ్యాచ్ రద్దయింది.నేటి మ్యాచ్ లో 156 పరుగుల మోస్తరు లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతాకు ఆదిలోనే భారీ షాక్ తగిలింది. ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్ (0), కెప్టెన్ అజింక్యా రహానే (0) డకౌట్ అయ్యారు. దీంతో 5 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కామెరూన్ గ్రీన్ (27) వేగంగా ఆడినా, ఆ తర్వాత వరుసగా వికెట్లు పడటంతో కేకేఆర్ 85 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రింకూ సింగ్‌కు అనుకుల్ రాయ్ (29లి) అండగా నిలిచాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు అజేయంగా 76 పరుగులు జోడించి మరో రెండు బంతులు మిగిలి ఉండగానే జట్టును విజయతీరాలకు చేర్చారు. రాజస్థాన్ బౌలర్లలో రవీంద్ర జడేజా 2 వికెట్లు పడగొట్టాడు.అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్, కేకేఆర్ బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (39), వైభవ్ సూర్యవంశీ (46) శుభారంభం అందించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కేకేఆర్ బౌలర్లలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 4 ఓవర్లలో కేవలం 14 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, కార్తీక్ త్యాగి కూడా 3 వికెట్లతో రాణించాడు. సునీల్ నరైన్ రెండు వికెట్లు తీసి రాజస్థాన్ పతనాన్ని శాసించాడు.



# మిస్టరీ స్పిన్నర్ల ఉచ్చులో రాజస్థాన్ రాయల్స్ విలవిల... కేకేఆర్ ముందు ఈజీ టార్గెట్

**ఈడెన్ గార్డెన్స్ లో కోల్ కతా నైట్ రైడర్స్ ఐ రాజస్థాన్ రాయల్స్**

**టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్**

**శుభారంభం అందించిన జైస్వాల్, సూర్యవంశీ**

**వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ వికెట్ల వేట**

**65 పరుగుల తేడాతో 8 వికెట్లు డౌన్**



కోల్‌కతా నైట్ రైడర్స్ మిస్టరీ స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ స్పిన్ ఉచ్చులో రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ లైనప్ చిక్కుకుంది. ఓ దశలో పటిష్ఠంగా కనిపించిన రాజస్థాన్, వీరిద్దరి ధాటికి చివరికి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులకే పరిమితమైంది. దీంతో కోల్‌కతా ముందు 156 పరుగుల సాధారణ లక్ష్యం నిలిచింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్‌కు ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (39), వైభవ్ సూర్యవంశీ (46) అద్భుత ఆరంభాన్నిచ్చారు. తొలి వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి భారీ స్కోరుకు బలమైన పునాది వేశారు. అయితే, సూర్యవంశీ ఔటైన తర్వాత రాజస్థాన్ ఇన్నింగ్స్ ఒక్కసారిగా తడబడింది.స్పిన్నర్లు రంగంలోకి దిగడంతో రాయల్స్ పతనం మొదలైంది. ముఖ్యంగా వరుణ్ చక్రవర్తి కేవలం 14 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టి రాజస్థాన్ మిడిలార్డర్‌ను దెబ్బతీశాడు. అతడికి తోడుగా సునీల్ నరైన్ 2 వికెట్లు తీసి ఒత్తిడి పెంచాడు. ఒక దశలో 81/0తో పటిష్ఠంగా ఉన్న రాయల్స్, ఆ తర్వాత 65 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. చివర్లో పేసర్ కార్తీక్ త్యాగి కూడా 3 వికెట్లతో చెలరేగడంతో రాజస్థాన్ భారీ స్కోరు చేయలేకపోయింది. మిగిలిన బ్యాటర్లు ఎవరూ రాణించకపోవడంతో రాజస్థాన్ సాధారణ స్కోరుకే పరిమితమైంది.

# కేకేఆర్ తో మ్యాచ్... టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్


**ఈడెన్ గార్డెన్స్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్**

**ఈ సీజన్‌లో ఇంకా విజయం సాధించని కోల్‌కతా నైట్ రైడర్స్**

**గత మ్యాచ్ ఓటమి తర్వాత గెలుపుపై దృష్టి సారించిన రాజస్థాన్**

**పిచ్ పొడిగా ఉండటంతోనే బ్యాటింగ్ తీసుకున్నామన్న కెప్టెన్ పరాగ్**

**తాము కూడా బ్యాటింగ్ చేయాలనుకున్నామని తెలిపిన కేకేఆర్ కెప్టెన్ రహానే**



ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న రాజస్థాన్, వరుస ఎ రా జ య ా ల తో న త వం త వం వు తం న్న కోల్‌కతా మధ్య ఈ పోరు ఆసక్తికరంగా మారింది.ఈ సీజన్‌లో వరుసగా నాలుగు విజయాలతో దూసుకెళ్లిన రాజస్థాన్, గత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓటమి పాలైంది. తిరిగి విజయాల బాట పట్టాలని పట్టుదలగా ఉంది. మరోవైపు, కోల్‌కతా నైట్ రైడర్స్ ఇప్పటివరకు ఆడిన ఆరు మ్యాచ్‌లలో ఒక్క విజయం కూడా సాధించలేకపోయింది. వర్షం కారణంగా రద్దయిన ఒక మ్యాచ్ ద్వారా లభించిన పాయింట్‌తో పట్టికలో అట్టడుగున ఉంది.టాస్ గెలిచిన రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ మాట్లాడుతూ, “పిచ్ పొడిగా ఉంది, కాబట్టి మొదట బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకున్నాం. గత మ్యాచ్ నుంచి పాఠాలు నేర్చుకుని మెరుగ్గా ఆడతాం,“ అని చెప్పాడు. హెట్‌మెయర్, బ్రిజేష్ తిరిగి జట్టులోకి వచ్చారని తెలిపాడు.మరోవైపు, కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే మాట్లాడుతూ, “మేము కూడా బ్యాటింగ్ చేయాలనే అనుకున్నాం. మా బ్యాటర్లు ఒత్తిడి లేకుండా ఆడాలని కోరుకుంటున్నాం. బౌలర్లు రాణిస్తుండటం సంతోషంగా ఉంది. జట్టులో ఎలాంటి మార్పులు లేవు“ అని వివరించాడు. ఐపీఎల్ చరిత్రలో ఈ రెండు జట్లు 32 సార్లు తలపడగా, కేకేఆర్ 16, రాజస్థాన్ 14 మ్యాచ్‌లలో విజయం సాధించాయి.రాజస్థాన్ రాయల్స్

వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్ (కెప్టెన్), షిమ్రాన్ హెట్‌మైర్, డొనోవన్ ఫెరీరా, రవీంద్ర జడేజా, జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్, రవి బిష్ణోయ్, బ్రిజేష్ శర్మ.

ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్‌లు: సందీప్ శర్మ, శుభమ్ దూబే, లువాన్-డ్రే ప్రిటోరియస్, రవి సింగ్, యశ్ పూంజా.

కోల్‌కతా నైట్ రైడర్స్‌అజింక్య రహానే (కెప్టెన్), టిమ్ సీఫెర్ట్ (వికెట్ కీపర్), కామెరాన్ గ్రీన్, రోవ్‌మన్ పావెల్, రింకూ సింగ్, సునీల్ నరైన్, రమన్‌దీప్ సింగ్, అనుకుల్ రాయ్, వైభవ్ అరోరా, కార్తీక్ త్యాగి, వరుణ్ చక్రవర్తి.ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్‌లు: అంగ్‌క్రిష్ రఘువంశీ, ఫిన్ అలెన్, మనీశ్ పాండే, తేజస్వి సింగ్, నవదీప్ సైనీ.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# నా మాటలను వక్రీకరించారు.. నేను అలాంటి వాడిని కాదు: ప్రకాశ్ రాజ్

**రామాయణంపై తన వ్యాఖ్యలను వక్రీకరించారన్న ప్రకాశ్ రాజ్**

**కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపణ**

**తాను హిందూ వ్యతిరేకిని కాదని, అన్ని మతాలను గౌరవిస్తానని స్పష్టీకరణ**

**ప్రశ్నలకు బదులివ్వలేకే కొందరు నేతలు ఈ ముద్ర వేస్తున్నారని విమర్శ**

రామాయణం, హిందూ ధర్మంపై ఇటీవల తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో నటుడు ప్రకాశ్ రాజ్ స్పందించారు. తన మాటలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ వీడియో ద్వారా వివరణ ఇచ్చారు.ఇటీవల ఓ సాహితీ కార్యక్రమంలో తాను చేసిన పూర్తి ప్రసంగాన్ని వదిలేసి, అందులోని కొన్ని భాగాలను మాత్రమే తీసుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. తాను శ్రీరాముడిని కించపరిచానని, హిందువుల మనోభావాలను దెబ్బతీశానని జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. తాను అన్ని ధర్మాలను సమానంగా గౌరవిస్తానని, ఎవరినీ తక్కువ చేసే ఉద్దేశం తనకు లేదని తెలిపారు.సమాజంలోని లోపాలను ప్రశ్నిస్తున్నందుకే తనపై కొందరు రాజకీయ నాయకులు 'హిందూ వ్యతిరేకి' అనే ముద్ర వేయాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు. తాను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే తన గొంతు నొక్కేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం తాను పొలం పనులతో తీరిక లేకుండా ఉన్నానని, ఆ పనులు పూర్తయ్యాక ఈ విషయంపై మరింతగా మాట్లాడతానని ప్రకాశ్ రాజ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

# కొత్త జానర్ ట్రై చేస్తున్న మైత్రీ మూవీ మేకర్స్... హారర్ అంటే హారరే!

మైత్రీ మూవీ మేకర్స్ నుంచి తొలి హారర్ సినిమా '418'

'కేజీఎఫ్' డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు

హారర్ కామెడీలకు భిన్నంగా పక్కా భయపెట్టే సినిమా అని ప్రకటన

కీర్తన్ నాదగౌడ దర్శకత్వంలో సూర్య రాజ్, చరణ్, ప్రీతి ప్రధాన పాత్రలు

రక్తం మరకలతో ఉన్న డోర్‌తో టైటిల్ పోస్టర్ విడుదల

టాలీవుడ్‌లో భారీ బడ్జెట్, కమర్షియల్ చిత్రాలకు చిరునామాగా నిలిచిన ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఇప్పుడు కొత్త జానర్‌లోకి అడుగుపెట్టింది. తొలిసారిగా ఓ పక్కా హారర్ సినిమాను నిర్మిస్తున్నట్లు ప్రకటించింది. ఈ చిత్రానికి 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పకుడిగా వ్యవరించడం విశేషం. '418' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో రక్తం మరకలతో ఉన్న ఒక పాత తలుపుపై '418' అనే నంబర్ కనిపిస్తోంది. ఇది సినిమా కథాంశంపై ఉత్కంఠను రేకెత్తిస్తోంది. "హారర్ సినిమాల్లో నవ్వింది చాలు.. ఇక భయపడాల్సిన సమయం వచ్చింది" అనే ట్యాగ్‌లైన్‌ను పోస్టర్‌పై జతచేశారు. ఇటీవల కాలంలో హారర్ కామెడీలు ఎక్కువైన నేపథ్యంలో, ప్రేక్షకులకు అసలైన భయాన్ని పరిచయం చేసేందుకే ఈ సినిమాను తీస్తున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది.కీర్తన్ నాదగౌడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడల్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రశాంత్ నీల్ వంటి స్టార్ డైరెక్టర్ ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఆయన సినిమాల్లో ఉండే డార్క్ థీమ్, ఇంటెన్స్ మూడ్ ఈ హారర్ చిత్రానికి అదనపు బలం అవుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి.








# రెండోసారి తల్లిదండ్రులు కాబోతున్న దీపికా, రణ్‌వీర్.. వినూత్నంగా ప్రకటన!

**కుమార్తె దువా చేతిలో ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్‌తో వినూత్నంగా ప్రకటన**

**2024 సెప్టెంబర్‌లో మొదటి కుమార్తె దువాకు జన్మనిచ్చిన జంట**


**బాలీవుడ్ ప్రముఖులు, అభిమానుల నుంచి వెల్లువెత్తుతున్న విషెస్**

**2018లో ఇటలీలోని లేక్ కోమోలో అంగరంగ వైభవంగా జరిగిన వీరి వివాహం**

బాలీవుడ్ స్టార్ కపుల్ దీపికా పదుకొణె, రణ్‌వీర్ సింగ్ తమ జీవితంలోకి మరో చిన్నారికి స్వాగతం పలకబోతున్నారు. దీపికా రెండోసారి గర్భవతి అయినట్లు సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ శుభవార్తను వారు పంచుకున్న తీరు అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో దీపికా ఒక క్యూట్ ఫొటోను పోస్ట్ చేశారు. ఆ ఫొటోలో వారి మొదటి కుమార్తె దువా, పాజిటివ్ ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్‌ను చేతిలో పట్టుకుని కనిపించింది. ఈ పోస్ట్‌కు దీపికా ఎలాంటి క్యాప్షన్ రాయకుండా కేవలం రెండు దిష్టిచుక్క ఎమోజీలను మాత్రమే జతచేశారు. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్ అవ్వగా, అభిమానులు, సినీ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. నటి భూమి పెడ్నేకర్ "కంగ్రాట్యులేషన్స్" అని కామెంట్ చేయగా, సమంత, పరిణీతి చోప్రా కూడా రెడ్ హార్ట్ ఎమోజీలతో తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.2018 నవంబర్ 14, 15 తేదీల్లో ఇటలీలోని లేక్ కోమోలో అంగరంగ వైభవంగా వివాహం చేసుకున్న ఈ జంటకు, 2024 సెప్టెంబర్ 8న మొదటి సంతానంగా కుమార్తె దువా జన్మించింది. "దువా అంటే ప్రార్థన అని అర్థం. మా ప్రార్థనలకు సమాధానంగా తను వచ్చింది" అంటూ అప్పట్లో వారు ఎంతో అర్థవంతమైన పోస్ట్ పెట్టారు. ఇప్పుడు దువా పుట్టిన ఏడాదిన్నర లోపే రెండో బిడ్డ రాక గురించి ప్రకటించడం విశేషం. సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన 'గోలియోం కీ రాస్‌లీలా రామ్-లీలా' సినిమా సెట్స్‌లో వీరి ప్రేమకథ మొదలైంది. 2015లో మాల్దీవుల పర్యటనలో రణ్‌వీర్, దీపికాకు ప్రపోజ్ చేశారు. మూడేళ్ల పాటు తమ ఎంగేజ్‌మెంట్ విషయాన్ని రహస్యంగా ఉంచి, ఆ తర్వాత పెళ్లితో ఒక్కటయ్యారు. ఆన్-స్క్రీన్, ఆఫ్-స్క్రీన్ కెమిస్ట్రీతో ఎంతగానో ఆకట్టుకున్న ఈ జంట 'బాజీరావ్ మస్తానీ', 'పద్మావత్', '83' వంటి పలు విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించారు. ఇప్పుడు రెండో బిడ్డ రాకతో వీరి కుటుంబంలో ఆనందం రెట్టింపు అయింది.

# పంథా మార్చిన జక్కన్న.. మహేశ్ సినిమా షూటింగ్‌కు లాంగ్ బ్రేక్!

సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి' షూటింగ్‌కు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త వెలువడింది. షూటింగ్ షెడ్యూళ్ల విషయంలో ఏమాత్రం రాజీ పడని జక్కన్న, ఈ సినిమా చిత్రీకరణకు ఏకంగా నెల రోజుల పాటు విరామం ప్రకటించడం ఇండస్ట్రీలో చర్చనీయాంశమైంది. పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా నటీనటులు, సాంకేతిక బృందం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఒక భారీ సెట్‌లో మహేశ్ బాబుపై కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిస్ నేతృత్వంలో ఒక పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ పాట పూర్తి కాగానే, మే నెల మొత్తం షూటింగ్‌కు బ్రేక్ ఇవ్వాలని రాజమౌళి నిర్ణయించారు. సాధారణంగా చిత్రీకరణలో విరామాలకు ఇష్టపడని జక్కన్న, యూనిట్ శ్రేయస్సు కోసం తన పంథా మార్చుకోవడం విశేషం. ఈ విరామ సమయంలో ఆయన పోస్ట్ ప్రొడక్షన్, వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్ పనులపై దృష్టి సారించనున్నారు. ఇప్పటికే ఈ చిత్రం షూటింగ్ 80 శాతం పూర్తయినట్లు సమాచారం.భారత సినీ చరిత్రలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో సుమారు రూ. 1400 కోట్లకు పైగా వ్యయంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'వారణాసి' ఒక గ్లోబ్‌ట్రోటింగ్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రమని, కథాంశం క్రీస్తు శకం 512 నుంచి భవిష్యత్తులోని 2027 వరకు సాగుతుందని తెలుస్తోంది. సోషియో-ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్ అంశాలతో ఇది ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనుంది. ఈ చిత్రంలో మహేశ్ బాబు 'రుద్ర' అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్రను హనుమంతుడి లక్షణాల స్ఫూర్తితో రాజమౌళి డిజైన్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.మహేశ్‌కు జోడీగా గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా 'మందాకిని'గా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ప్రకాశ్ రాజ్ కూడా ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రత్యేకంగా 1.43:1 ×మీూశ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్న తొలి నాన్-ఇంగ్లీష్ చిత్రంగా 'వారణాసి' రికార్డు సృష్టించనుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సినిమాను 2027 ఏప్రిల్ 7న శ్రీరామనవమి కానుకగా ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com